



పోస్టల్ @ అవుట్ డేటెడ్!



కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్నాయన్న మాటే కానీ, ఆధునిక సాంకేతిక వసతులను కూర్చుకోవడంలో తపాలా కార్యాలయాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. చాలదన్నట్లు సిబ్బంది కొరతతో సతమతమవుతున్నాయి. దీంతో పొదుపు ఉద్యమం ఊపందుకున్నా సరే, ఖాతారులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాజాగా అపార్ కార్డులకోసం ఆధార్ అప్డేషన్‌కోసం వెల్లువెత్తుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు అవస్థల పాలవుతున్నారు.

- కుప్పం, ఆంధ్రజ్యోతి

- అప్డేట్ కాని తపాలా కార్యాలయాలు!
- ఏటీఎం కార్డుల కొరతతో ఖాతాదారుల ఇబ్బందులు
- ఆధార్ అప్డేషన్‌కోసం విద్యార్థుల తల్లిదండ్రుల అవస్థలు

జాతీయ బ్యాంకులు, ప్రైవేటు బ్యాంకుల కంటే కూడా నిజానికి ఇప్పుడు తపాలా కార్యాలయాలనే ఎక్కువమంది నమ్ముతున్నారు. ఈ నమ్మకం రావడానికి చాలాకాలమే పట్టినా, ప్రస్తుతం ఉద్యోగులు మొదలుకుని పొదుపు సంఘాలు, సామాన్యుల దాకా తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరవడానికి, వివిధ పథకాల కింద సొమ్ము డిపాజిట్ చేయడానికి, జీవిత బీమా పాలసీలు తీసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. కేవలం రూ.300లతో సేవింగ్స్ ఖాతాలు తెరిచే వెసులుబాటు ఉండడమే కాదు, బ్యాంకులతో పోలిస్తే అప్లికేషన్ ప్రక్రియ కూడా సరళతరంగా ఉండడం దీనికి ప్రధాన కారణం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ట్యాక్స్ మినహాయింపు పొందడానికి బ్యాంకుల జీవిత బీమా పాలసీలకంటే తపాలా జీవిత బీమా పాలసీలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. బ్యాంకులతో పోలిస్తే వడ్డీ శాతం కాస్త అధికంగా ఉండడమే కాదు, గ్రామగ్రామానా పోస్టాఫీసులు అందుబాటులో ఉండడం కూడా దీనికి కారణం. ఉద్యోగులు తపాలా కార్యాలయాల్లో డిపాజిట్లు చేయడాన్ని కూడా ఎంచుకోవడం ఇటీవల ఎక్కువవుతోంది. దీనితోపాటు సేవింగ్స్ ఖాతాలు సైతం సామన్యులతోపాటు తెరిచి ప్రతినెలా ఎంతోకొంత పొదుపు చేస్తున్నారు.

పోస్టల్ యాప్ సమస్యలు

ప్రభుత్వ, ప్రైవేటు శాఖలు ప్రత్యేకమైన యాప్‌లతో తమ సేవలను సులువైన మార్గంలో ఖాతాదారులకు అందిస్తున్నాయి. ఉదాహరణకు ఎస్బీఐ ఖాతాదారులు ఎటువంటి సేవలైనా యోనో యాప్‌ను సొంతంగా సులువుగా డౌన్ లోడ్ చేసుకుని దాని ద్వారా పొందవచ్చు. తపాలా శాఖకు కూడా పోస్టల్ యాప్ ఒకటి ఉన్నది కానీ, దాన్ని ఖాతాదారులు సొంతంగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు మాత్రం లేదు. తప్పనిసరిగా పోస్టాఫీసుకు వెళ్లి, అక్కడి సిబ్బంది సాయంతోనే డౌన్ లోడ్ చేసుకోవాల్సి వస్తోంది. వీళ్ల వెళ్లినప్పుడు సిబ్బంది వేరే పనిలో ఉండడంతో అది వీలుకావడంలేదు. అలా పలుమార్లు తిరగలేక, సొంతంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకునే సులువు లేక ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం తమ ఇబ్బందులు పట్టించుకుని, తపాలా కార్యాలయాల్లో తగిన సిబ్బందిని నియమించి, యాప్ డౌన్‌లోడ్‌ను సులభతరం చేయాలని ఖాతాదారులు కోరుతున్నారు.

ఏటీఎం కార్డుల కొరతతో సమస్య

తపాలా కార్యాలయాల్లో సేవింగ్స్ ఖాతాలు, డిపాజిట్లు తెరవడం ఎక్కువవుతోంది కానీ, అందుకు అనుగుణంగా సరైన సేవలను ఇవి అందించలేకపోతున్నాయి. ఉదాహరణకు ఏటీఎం కార్డుల కొరత తీవ్రంగా పీడిస్తోంది. సాధారణంగా చిన్నమొత్తాలు పొదుపు చేసుకునే సామాన్యుల మొదలు, కొంచెం పెద్దమొత్తాలలోనే సేవింగ్స్ ఖాతాలలో జమ చేసుకునే ఉద్యోగులు అందరూ తమకు అవసరమైనప్పుడు ఖాతాలలోని సొమ్ము ఎక్కడైనా సరే విత్ డ్రా చేసుకునే వెసులుబాటు కోరుకుంటారు. ఈ వెసులుబాటును బ్యాంకులు సులువుగా కల్పిస్తున్నాయి. తమ శాఖలకు అనుబంధంగా లెక్కకుమిక్కిలి ఏటీఎం స్టేషన్లను ఏర్పాటు చేయడమేకాదు, ఖాతా తెరుస్తూనే ఏటీఎం కార్డులను మంజూరు చేస్తున్నాయి. తపాలా శాఖకు ఇటువంటి ఏటీఎం స్టేషన్లు ఇంతవరకూ లేవు. కానీ ఏటీఎం కార్డులు మాత్రం జారీ చేస్తోంది. ఈ ఏటీఎం కార్డులను ఏ బ్యాంకు ఏటీఎం మిషన్ ద్వారానైనా ఆపరేట్ చేసి నగదును విత్ డ్రా చేసుకునే వెసులుబాటు ఉంది. అయితే ఏటీఎం కార్డుల కొరత ఎక్కువగా ఉంది. ఉదాహరణకు ఏడాది కాలంగా చిత్తూరు జిల్లాలోని ఏ తపాలా కార్యాలయానికీ ఏటీఎం కార్డులు సరఫరా కాలేదు. ఈ ఏడాది కాలంలో తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరిచినవారెవరికీ ఈ కార్డులు అందలేదు. దీంతో ఖాతారులు డబ్బు అవసరమైన ప్రతిసారీ తపాలా కార్యాలయాలకే నేరుగా వచ్చి, నగదు విత్ డ్రా చేయాల్సి వస్తోంది. పనులు మానుకుని ఇలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం వారికి ఇబ్బందిగా ఉంది. ఏటీఎం కార్డులను వెంటనే మంజూరు చేయాలని ఖాతారులు కోరుకుంటున్నారు.

మళ్లీ రానున్న బేబీ కిట్లు

ఎన్టీఆర్ బేబీ కిట్

- 2016లో ప్రారంభించిన చంద్రబాబు
- వైసీపీ పాలనలో సరఫరా నిలిపివేత
- ఇబ్బంది పడుతున్న పేదింటి తల్లులు
- పునరుద్ధరణపై కూటమి ప్రభుత్వం దృష్టి

చిత్తూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు శిశు సంరక్షణలో భాగంగా పంపిణీ చేస్తుండిన ఎన్టీఆర్ బేబీ కిట్లను వైసీపీ వచ్చాక నిలిపేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం పునరుద్ధరణపై దృష్టి పెట్టింది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు చేసుకునే పేదింటి తల్లులను దృష్టిలో పెట్టుకుని శిశు సంరక్షణ దృష్ట్యా టీడీపీ హయాంలో ఎన్టీఆర్ బేబీ కిట్లను పంపిణీ చేసేవారు. 2016 జూలై ఒకటో తేదీన అప్పటి సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ కిట్‌లో సుమారు 1500 విలువైన టవల్, హ్యాండ్ వాష్ లిక్విడ్, బేబీ పరుపు, దోమ తెర.. ఇలా నాలుగు రకాల వస్తువులు ఉండేవి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకానికి వైఎస్ఆర్ బేబీ కిట్ అని పేరును మార్చేసింది. 2020 ఫిబ్రవరి వరకు కిట్లు పంపిణీ చేసింది. ఆ తర్వాత అనేక కారణాలు చెప్పి వీటి సరఫరా నిలిపివేసింది. అప్పటినుంచి పేదింటి తల్లులు ఇబ్బందులు పడుతున్నారు.

ఐదేళ్లలో లక్షకుపైగా ప్రసవాలు

జిల్లాలో ఆరు సీహెచ్‌సీలు, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 50 పీహెచ్‌సీలు, ఓ జిల్లా ఆస్పత్రి ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో నెలకు 2వేల నుంచి 3వేల వరకు ప్రసవాలు జరుగుతుంటాయి. ఐదేళ్లుగా సుమారు లక్షకుపైగా ప్రసవాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చంద్రబాబు ప్రవేశపెట్టిన కార్యక్రమం కావడంతో బాలింతల్లో ఆశలు చిగురించాయి. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం కూడా ప్రసవాలకు సంబంధించిన వివరాలను సేకరిస్తోంది. త్వరలో ఈ పథకం పునరుద్ధరించే అవకాశాలున్నాయి.





జనం నుంచి వినతులు స్వీకరిస్తున్న చంద్రబాబు

ఎ.రంగంపేటలో ఏఐ టెక్నాలజీ హబ్

- నారావారిపల్లె క్లస్టర్‌పై సీఎం వరాల జల్లు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ సౌజన్యంతో చంద్రగిరి మండలం ఎ.రంగంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏఐ టెక్నాలజీ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం గ్రామస్తులతో మంగళవారం ఆయన ముఖాముఖి నిర్వహించారు. ఏఐ టెక్నాలజీ ల్యాబ్ వల్ల క్లస్టర్ పరిధిలోని 8 పాఠశాలల విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా రాణించేలా తయారవుతారన్నారు. క్లస్టర్ పరిధిలోని 2160 కుటుంబాల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. వచ్చే నెలాఖరులోగా వందశాతం బహిరంగ మల విసర్జన లేని గ్రామాలు కావాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన 286 మందికి ఏడాదిలోపు ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఇక్కడా పైప్ లైన్ గ్యాస్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్లకు సోలార్ విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపించాలని రైతులకు సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు శ్రీకారం చుట్టామన్నారు. ఈనెల 18న వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభిస్తున్నామని, తద్వారా ఆధార్, కులం, నేటివిటీ, బర్త్ సర్టిఫికెట్లు, అడంగల్ వంటి 150 సర్వీసుల వరకు అందుబాటులోకి వస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. నారావారిపల్లె ఆస్పత్రిలో 5 వేల మంది వరకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రూ.8 కోట్లతో ఎ.రంగంపేట నుంచి భీమవరం, మంగళంపేట రోడ్లను పూర్తి చేస్తామన్నారు. 500 మంది వరకు చదువుకునేందుకు, పని చేసేందుకు ఐటీ టవర్ ఏర్పాటు చేస్తామన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేసి.. శ్రీసిటీ వంటి పరిశ్రమలతో అనుసంధానించి ఉపాధి కల్పిస్తామన్నారు. రేణిగుంట సమీపంలో 10 ఎకరాల స్థలంలో రతన్ టాటా స్ఫూర్తితో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేసి ఇక్కడి యువతను పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హంద్రీనీవా నీటిని మూలపల్లెకు, కణితమడుగు చెరువులకు, కల్యాణి డ్యామ్, నాగపట్ల, వెంకట్రాయుని చెరువులకు అనుసంధానం చేస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. కల్యాణి డ్యామ్‌ను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. సంక్షేమ పథకాల పంపిణీలో మోసాలు జరగకుండా టెక్నాలజీని వినియోగిస్తామని వివరించారు.

23 మండలాల్లో వర్షం

చిత్తూరు సెంట్రల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 23 మండలాల్లో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బంగారుపాళ్యంలో 23 మిల్లీమీటర్లు నమోదు కాగా, అత్యల్పంగా నగరిలో 0.2 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి... జీడీ నెల్లూరులో 20.8, వి.కోటలో 20, గంగవరంలో 13.4, కార్వేటినగరంలో 12.4, పలమనేరులో 11, బైరెడ్డిపల్లిలో 9.2, పాలసముద్రంలో 8.2, పూతలపట్టులో 7.8, వెదురుకుప్పంలో 7.2, రామకుప్పంలో 6.2, చిత్తూరులో 5, పెద్దపంజాణి, చిత్తూరు రూరల్‌లో 4.8, శాంతిపురంలో 3.4, నింద్రలో 3.2, చౌడేపల్లిలో 2.4, గుడిపాలలో 2.2, పుంగనూరులో 2, రొంపిచెర్లలో 1.4, కుప్పంలో 1.2, పెనుమూరులో 0.6 మి.మీ నమోదైంది.

బూత్ స్థాయి నుంచి పార్టీ పునర్నిర్మాణం

- కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటాం
- దొంగ ఓట్ల వ్యవహారాన్ని వదిలిపెట్టేది లేదు
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్



చంద్రగిరి ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న లోకేశ్

తిరుపతి(విద్య)/చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బూత్ స్థాయి నుంచి పార్టీని పునర్నిర్మిస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ అన్నారు. వచ్చే నెల నుంచి పార్టీకోసం అధిక సమయం కేటాయిస్తానన్నారు. నారావారిపల్లెలో బుధవారం ఆయన చంద్రగిరి నియోజకవర్గ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. క్లస్టర్, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో ప్రతీఒక్కరూ పార్టీకోసం కొంత సమయం కేటాయించాలని, మరింత చొరవగా పనిచేయాలని సూచించారు. పార్టీ కార్యకర్తలను అన్ని విధాలా ఆదుకుంటామని, క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పదవులు వస్తాయన్నారు. పార్టీకోసం అహర్నిశలు పాటుపడిన వారికే గత ఎన్నికల్లో టిక్కెట్లు ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా మనం సేవలందించాలని, అహంకారంగా నడుచుకోకూడదంటూ దిశానిర్దేశం చేశారు. యువగళంలో పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టారో తనకు తెలుసని, తప్పుచేసినవారిని ఎవరినీ వదలేది లేదన్నారు. తిరుపతి పార్లమెంటు పరిధిలో దొంగ ఓట్ల వ్యవహారాన్ని కూడా వదిలిపెట్టేది లేదన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో సభ్యత్వం చాలాబాగా చేశారని నాయకులు, కార్యకర్తలను అభినందించారు. జనవరి ఒకటి నుంచే పార్టీ సభ్యులకు బీమా అమలవుతోందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇస్తే రూ.5 లక్షల బీమా ఇప్పించే బాధ్యత తనదన్నారు. కార్యకర్తల పిల్లల భవిష్యత్తు కోసం ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని, వారికి స్వయం ఉపాధి కల్పించే అవకాశాలపై దృష్టిసారిస్తున్నామని చెప్పారు. అన్ని మండలాల ముఖ్య కార్యకర్తలను కలివిడిగా పలకరిస్తూ, వారి బాగోగులు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి హేమాంబరధరరావు, పార్టీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఈశ్వర్‌రెడ్డి, బెల్లంకొండ మురళి, తిరుమలరెడ్డి, నాగరాజనాయుడు, ఇతర నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



రంకేసిన కోడెగిత్తలు

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాల్లో కనుమ సందర్భంగా బుధవారం జల్లికట్టు నిర్వహించారు. తమ కోడెగిత్తలు, ఆవులు, దూడల కొమ్ములకు రైతులు రంగులేసి నగదు, విలువైన వస్తు సామగ్రిని, వివిధ రాజకీయ నాయకులు, సినీనటుల ఫొటోలతో కూడిన చెక్క పలకలు కట్టారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఎ.రంగంపేట యాదవ వీధిలో గుంపులు, గుంపులుగా వదిలారు. జిల్లా నలుమూలల నుంచీ వేలాదిగా వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడ్డారు. రంకెలేస్తూ జోరుగా పరుగు తీసిన కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. వీటి కొమ్ములకు కట్టిన చెక్కపలకలను, వస్తువులను సొంతం చేసుకునే ప్రయత్నంలో యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువుల ప్రతిఘటనలో కొంతమందికి గాయాలయ్యాయి. కొందరు ఇళ్లపైభాగాన, చెట్ల కొమ్మలపై నిలబడి తిలకించారు. జల్లికట్టు నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. అరిగిలవారిపల్లెలోనూ జల్లికట్టు ప్రశాంతంగా ముగిసింది. కొందరు స్వల్పంగా గాయపడ్డారు. జల్లికట్టుకు వేలాది మంది జనం తరలిరావడంతో ఎ.రంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా వెళ్ళే రోడ్డు మార్గం పూర్తిగా స్తంభించింది. ఈ కార్యక్రమంతో ఎ.రంగంపేట, అరిగిలవారిపల్లె గ్రామాలు జనసంద్రమయ్యాయి.





గురజాలకు పలువురి శుభాకాంక్షలు





చిత్తూరు శాసనసభ్యుడు గురజాల జగన్మోహన్ జన్మదిన వేడుకలు చిత్తూరులో బుధవారం ఘనంగా జరిగాయి. వైద్య,రక్తదాన శిబిరాలను నిర్వహించడంతో పాటు పేదలకు పెద్దఎత్తున సహాయాలను జగన్మోహన్ పంపిణీ చేశారు.

నైనిటాల్ ఎక్స్‌ప్రెస్ స్టాపింగ్‌పై కుప్పంవాసుల్లో హర్షం


రైల్వే సిబ్బందిని సన్మానిస్తున్న జగదీశ్‌బాబు, రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నుంచి కుప్పం మీదుగా ఉత్తరాఖండ్‌లోని లాల్‌కువాకు వెళ్లే నైనిటాల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ రైలును బుధవారం కుప్పంలో కొద్దిసేపు ఆపి పూజలు చేశారు. ఈ సందర్భంగా సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు మాట్లాడుతూ నైనిటాల్ ఎక్స్‌ప్రెస్ రైలు బెంగళూరు నుంచి బయలుదేరి కుప్పం, రేణిగుంట, విజయవాడ, వరంగల్, నాగపూర్, ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా, మధుర మీదుగా ఉత్తరాఖండ్‌లోని దేవభూమికి వెళుతుందని చెప్పారు. హిందువులు పవిత్ర ప్రదేశాలుగా భావించే గంగోత్రి, యమునోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లతోపాటు ఢిల్లీ తదితర ప్రాంతాలను ఈ రైలు ప్రయాణం ద్వారా సందర్శించవచ్చన్నారు. నైనిటాల్ ఎక్స్‌ప్రెస్ ప్రతి మంగళవారం ఉదయం 9 గంటలకు కుప్పం రైల్వే స్టేషన్ నుంచి విజయవాడ మీదుగా లాల్‌కువా చేరుతుందన్నారు. అలాగే లాల్‌కువాలో ప్రతి శనివారం బయలుదేరి ఆదివారం అర్ధరాత్రి విజయవాడకు చేరుకుని అక్కడి నుంచి సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు కుప్పం వస్తుందని చెప్పారు. లోకో పైలట్ డ్రైవర్లు, రైల్వే సిబ్బందిని సన్మానించారు. రైలు నిలుపుదలకు కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు, రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు, చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంకు కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ టికెట్లతో దర్శనానికి అనుమతి

● తిరుమలలో ఇద్దరి అరెస్ట్

తిరుమల, జనవరి15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో నకిలీ టికెట్లతో అనుమతిస్తున్న బాగోతం బుధవారం బయటపడింది. కాంట్రాక్ట్ ఉద్యోగితో పాటు పలువురు దళారులను విజిలెన్స్ వింగ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చెన్నైకి చెందిన జగదీష్, తిరుపతికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ శశి, ఫైర్ విభాగంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మణికంఠ కొంతకాలంగా భక్తులకు నకిలీ టికెట్లు అందజేస్తున్నారు. జగదీష్, శశి పంపే భక్తులకు రూ.300 దర్శన టికెట్లపై పేర్లు, ఆధార్ వివరాలను మణికంఠ ఎడిట్ చేస్తున్నట్టు విజిలెన్స్ విచారణలో తేలింది. ఎడిట్ చేసిన నకిలీ టికెట్లను భక్తులకు అందజేసి రూ.300 దర్శన టికెట్ల స్కాన్ కేంద్రంలో లక్ష్మీపతి(లక్ష్మీశ్రీనివాస మ్యాన్ పవర్ కార్పోరేషన్ ఉద్యోగి) వద్దకు పంపుతున్నారు. ఈ టికెట్లను అతడు స్కాన్ చేసినట్టు నటించి దర్శనానికి అనుమతిస్తున్నట్లు. విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మణికంఠతో పాటు లక్ష్మీపతిని అదుపులోకి తీసుకుని విచారించారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరుకు చెందిన 11 మంది భక్తులకు రూ.17 వేలకు ఈ టికెట్లు విక్రయించినట్లు తేలింది. వీరిద్దరిని తిరుమల పోలీసులకు అప్పగించారు. విచారణ మొదలైంది. గతంలో కూడా కార్పొరేషన్ ఉద్యోగి నకిలీ టికెట్లను స్కాన్ చేస్తున్నట్టు నటించడాన్ని గుర్తించి అరెస్ట్ చేశారు. తాజాగా ఈ అక్రమం బుధవారం వెలుగుచూసింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుగుతోంది.

నేడు పులిగుండు తిరుణాళ్లు

పెనుమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు సమీపంలో వెలసిన పులిగుంటీశ్వర ఆలయంలో సంక్రాంతి చివరి రోజున తిరుణాళ్ల ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. గురువారం నిర్వహించే ఈ తిరుణాళ్లకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున ప్రజలు విచ్చేసి స్వామివారిని దర్శించుకుంటారు. స్వామివారిని కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్ అగ్రహారం మీదుగా ఊరేగిస్తారు. పులిగుండు కొండపైకి వెళ్లి ప్రకృతిని ఆస్వాదిస్తారు. ఏటా 10వేలమంది ప్రజలు ఈ తిరుణాళ్లకు హాజరవుతారని అంచనా. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చైర్మన్ షణ్ముగరెడ్డి తెలిపారు.

పలమనేరులో దళితుడి దారుణహత్య


శివకుమార్ మృతదేహం

పలమనేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన దళితుడు శివకుమార్(35) సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. పలమనేరు సమీపంలోని జాతీయ రహదారి వద్ద హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలోని ఓ ప్రైవేటు నర్సరీ వెనుక వైపు తలపై బండరాయితో కొట్టి హత్యచేశారు. స్థానికులు 14న ఉదయం శివకుమార్ మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నరసింహరాజు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శివకుమార్ హత్యకు అక్రమ సంబంధమేనని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పోలీసులు తెలిపారు. కేసులో అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.


గంజాయి ముఠా అరెస్టు

8 కిలోల సరకు స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వి.కోటలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, సీఐ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం కేజీఎఫ్ రోడ్డులోని సాయిబాబా ఆలయం వెనుక గంజాయి విక్రయిస్తున్న ముఠాపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వి.కోట మండలం ముదిమడుగు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ పరంధామ, ఖాజీపేటకు చెందిన దావూద్, బెంగళూరుకు చెందిన ఆంథోని, పలమనేరుకు చెందిన శివ, భైరెడ్డిపల్లెకు చెందిన చిరంజీవిలను అదుపులోకి తీసుకుని వారి నుంచి 8 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముఠాతో సంబంధాలున్న ఎవరినీ ఉపేక్షించేదిలేదని, త్వరలోనే మిగిలిన నిందితులను అరెస్టు చేస్తామన్నారు. ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఇద్దరు పోలీసులకు నగదు రివార్డులను డీఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. దాడుల్లో ఎస్సై బాబు, ఏఎస్సైలు మురళీరెడ్డి, జయకృష్ణా తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన యువకుడు... ఎన్టీఆర్ జలాశయంలో శవమై తేలాడు


మురుగన్ (ఫైల్‌ఫోటో)

పెనుమూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవగుంట గ్రామానికి చెందిన శేఖర్ కుమారుడు మురుగన్ (32) ఈనెల 12వ తేదీన కనిపించడంలేదని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పెనుమూరు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే మంగళవారం ఎన్టీఆర్ జలాశయంలో ఓ మృతదేహం తేలుతుండగా గుర్తించిన కొందరు స్థానికులకు సమాచారం ఇచ్చారు. వారు పోలీసులకు తెలపడంతో అగ్నిమాపక సిబ్బందితో మృతదేహాన్ని బయటకుతీసి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు మురుగన్ తల్లిదండ్రులను పిలిచి మృతదేహాన్ని చూపెట్టగా తమ కుమారుడేనని కుటుంబీకులు గుర్తించారు. ఇతడి మానసిక పరిస్థితి కొద్ది రోజులుగా సరిగ్గాలేదని గ్రామస్తులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏనుగుల గుంపు హల్‌చల్

● పంటలను తొక్కి నాశనం చేస్తున్నాయని రైతుల ఆవేదన


మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు - అరటి, వరి పంటను ఏనుగుల గుంపు తొక్కి నాశనం చేశాయని చూపుతున్న కోదండయాదవ్

బంగారుపాళ్యం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోడబండ్ల అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న పొన్నెపాళ్యం, లక్ష్మీపురం, సీజేఎఫ్ఎస్ కాలనీ, జంబునేరుడుపల్లె ప్రాంతాల్లో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి తీవ్ర నష్టం చేశాయి. బాధిత రైతు పొన్నెపాళ్యంకు చెందిన కోదండ యాదవ్ మాట్లాడుతూ సోమవారం రాత్రి ఏనుగుల గుంపు పంట పొలాల్లోకి వచ్చి మామిడి, వరి, కొబ్బరి, అరటి, ఉలవల పంటలను తొక్కినాశనం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగులతో పాటు చిరుతల సంచారం కూడా ఉందని, పొలాల్లో పని చేయాలంటేనే భయంగా ఉందని, అటవీ శాఖాధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని వాపోయారు. బోడబండ్ల గ్రామానికి చెందిన బి.శంకరా మాట్లాడుతూ మూడు రోజుల క్రితం చిరుత దాడిలో రెండు గొర్రెలను కోల్పోయినట్లు చెప్పారు. మేతకు గొర్రెలు, మేకలను అటవీప్రాంతానికి తీసుకెళ్లాలంటేనే భయంగా ఉందని తెలిపారు. అలాగే మాజీ సర్పంచు వెంకటస్వామికి చెందిన మామిడి,వరి, అరటి పంటలను ధ్వంసం చేశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వన్యమృగాల దాడుల నుంచి పంటలను రక్షించాలని ఆయన కోరారు.

వరసిద్ధుడికి వెండి కవచం విరాళం

ఐరాల(కాణిపాకం),జనవరి15(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన సురేఖ మంగళవారం వెండి కవచాన్ని విరాళంగా అందించారు. ఈ కవచం రెండు కిలోల బరువు కలిగి రూ.2,50,000 విలువ చేస్తుందని సూపరింటెండెంట్ వాసు తెలిపారు. విరాళదాతకు దర్శన ఏర్పాట్లు గావించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.




వరసిద్ధుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వరసిద్ధుడికి వైభవంగా గ్రామోత్సవం

ఐరాల(కాణిపాకం), జనవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం సంక్రాంతిని పురస్కరించుకుని వరసిద్ధుడి మూల విరాట్‌కు వైభవంగా అభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం వరసిద్ధుడిని సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలి వచ్చారు. కాణిపాకానికి చెందిన శ్రీవిఘ్నేశ్వర యువజన సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

ఘనంగా గోపూజ


గోవులకు దాణా తినిపిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం కాణిపాకంలో గోవులకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. గోశాల సిబ్బంది గోవులను శుభ్రంగా కడిగి, అలంకరించారు. ఉదయం ఆలయ మాడవీధిలో వాటికి దాణాను సూపరింటెండెంట్ వాసు తినిపించారు. అనంతరం మాడవీధులలో ఊరేగించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకు చంద్రబాబు మొక్కులు - బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి తన తల్లిదండ్రుల సమాధి వద్ద సీఎం చంద్రబాబు నివాళులు

సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం

చంద్రగిరి, జనవరి 15(ఆంధ్రజ్యోతి):చంద్రగిరి మండలం నారావారిపల్లెలో మంగళవారం సంక్రాంతి కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. నారా, నందమూరి కుటుంబాలు సందడి చేశాయి. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచె కట్టిన సీఎం చంద్రబాబు.. తన సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేశ్, కోడలు బ్రాహ్మణి, మనవడు దేవాన్ష్, దివంగత నారా రామూర్తినాయుడి సతీమణి ఇందిర, సినీహీరో రోహిత్, చంద్రబాబు సోదరి హైమావతి, కుమార్తె చరిత, నందమూరి రామకృష్ణ, బాలకృష్ణ సతీమణి వసుంధర, చిన్న కుమార్తె తేజస్విని, అల్లుడు, ఎంపీ భరత్, మనవడు ఆర్యవీర్ తదితరులతో కలిసి కలిసి గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు.. కులదైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టకు పాలు పోశాక తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. ఉదయం 11.25 గంటలకు తన తల్లిదండ్రులు నారా ఖర్జూరపునాయుడు, అమ్మణమ్మ సమాధుల వద్ద నివాళులర్పించారు. ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సీఎం ఇంటి బయటే ఉండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల సమస్యలు విన్నారు. అర గంటకుపైగా ఉండి అర్జీలు స్వీకరించారు. సాయంత్రం తన బంధువు కృష్ణమనాయుడు ఇంటికి వెళ్లి పరామర్శించారు. 6.35 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి, పూతలపట్టు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు, చంద్రగిరి టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సహాయ మావటిపై కుంకీ ఏనుగు దాడి

సందర్శకులకు అనుమతి నిషేధం


జయంత్‌కు చికిత్సలు అందిస్తున్న వైద్యులు


జయంత్, వినాయక్

రామకుప్పం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల ననియాలలోని కౌండిన్య క్యాంపులో వున్న కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్ విచక్షణారహితంగా ప్రవర్తిస్తున్నాయి. వాటి బాగోగులు చూసుకునే మావటీలు, సహాయ మావటీలను సైతం ముప్పతిప్పలు పెడుతున్నాయి. ఇటీవల జయంత్ ఓ సహాయ మావటిపై తొండంతో దాడి చేసింది. దీంతో అతను స్వల్పగాయాలతో కుప్పం ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకుంటున్నాడు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు మగ ఏనుగులు చాలా కోరికతో ఉంటాయని అటవీ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే జయంత్ మావటిపై దాడి చేసిందన్నారు. డిసెంబరు నుంచి తిరుపతి జూపార్కు వైద్యులు అరుల్.. జయంత్, వినాయక్‌లకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందిస్తున్నారు. శాంతిపురం పశు వైద్యాధికారి వెంకటేశ్ సైతం తరచూ అందుబాటులో ఉంటూ పర్యవేక్షిస్తున్నారు. జయంత్, వినాయక్ ప్రవర్తనలో తేడా వుండడంతో వాటి సందర్శనకు వచ్చే పర్యాటకులను కుంకీ క్యాంపులోకి అనుమతించడం లేదు. అడవిలోని ఏనుగులు సైతం డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకు ఇలాగే ఉంటాయని.. అటవీ సమీప పొలాలు కలిగిన రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జనావాసాల వైపు ఏనుగులు వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదం


నాగమ్మ

తిరుపతి, జనవరి15 (ఆంధ్రజ్యోతి): ఎడారి దేశంలో మరో మహిళ ఆర్తనాదాలు సోషల్ మీడియాలో ఘోషిస్తున్నాయి. తనను ఆదుకుని ఇండియాకు పంపించాలంటూ ఆమె చేతులు వేడుకుంటున్నాయి. ఎడారిలో ఆదుకునే ఒయాసిస్‌ల కోసం ఆమె కళ్లు వెతుకుతున్నాయి. వెంకటగిరి పరిసర ప్రాంతానికి చెందిన నాగమ్మ.. కుటుంబ పోషణ కోసం కువైత్‌కు వెళ్లాలనుకున్నారు. రాజంపేట, కోడూరుకు చెందిన ఇద్దరు ఏజెంట్లు మంచి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించారు. తీరా కువైత్‌కు వెళ్లాక తెలిసింది.. చెప్పినదొకటి, అక్కడ జరుగుతున్నది మరొకటని. ఇబ్బడిముబ్బడిగా జనం ఉండే ఇంట్లో ఈమె ఒక్కటే పని మనిషి అయ్యారు. రోజురోజుకు పని ఎక్కువ కావడంతో అనారోగ్యం పాలయ్యారు. ఇక ఆ ఇంట్లో పని చేయలేనని ఏజెంట్లకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి ఆమె ఫోన్లకు కూడా స్పందించడం మానేశారు. అక్కడ్నుంచి బయటపడే మార్గాలను వెదుకుతూ.. ఒంగోలుకు చెందిన సామాజిక సేవకుడు సర్దార్ బాషాకి ఆమె వీడియో కాల్ చేసి తన పరిస్థితిని వివరించారు. తనని కాపాడాలని, తనని ఎడారిలోకి తీసుకెళ్లి చంపేస్తారేమోనని భయంగా ఉందంటూ ఆమె వీడియోలో విలపించారు. కువైత్‌లోని జహరాలో ఉన్న తనను సేఠ్ వాళ్లు చిత్ర హింసలు పెడుతున్నారని, అన్నం తిని నాలుగు రోజులు అయిందని, ఒంటినిండా పుండ్లు పడ్డాయని వాటిని చూపిస్తూ ఆమె రోదిస్తున్నారు. రూ1.3లక్షలు చెల్లిస్తే ఇండియాకు పంపుతామంటున్నారని, తన దగ్గర రూపాయి కూడాలేదని వాపోయారు. ఈ విషయాన్ని సర్దార్ బాషా తన సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో దుబాయ్‌లో నివసిస్తున్న తిరుపతివాసి డాక్టర్ ముక్కు తులసికుమార్‌కి చేరింది. వెంటనే స్పందించిన ఆయన తిరుపతి డీఎస్పీ గిరిధర్‌ని సంప్రదించి ఆమె వివరాలు అందించినట్టు తెలిసింది. గత నెలలోనూ శ్రీకాళహస్తికి చెందిన ఓ మహిళ కువైత్‌లో నరకయాతన పడుతుంటే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో పోలీసులు చొరవతీసుకుని ఆమెను ఇండియాకు రప్పించిన విషయం తెలిసిందే.

ప్రధానితో పరీక్షా పే చర్చకు శ్రీకాళహస్తి విద్యార్థి


శ్రీకర్

తిరుపతి(విద్య), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతో జరుగనున్న పరీక్షా పే చర్చకు జిల్లాకు చెందిన విద్యార్థి శ్రీకర్ ఎంపికైనట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీకర్ ఈ ఏడాది జిల్లా నుంచి ఎంపికయ్యారన్నారు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లిన శ్రీకర్, ఎస్కార్ట్ ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసులు శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(క్రీడలు), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ క్రీడా పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ, హోలీక్రాస్ హైస్కూల్ మైదానాల్లో జరిగే పోటీలకు జిల్లాలోని క్రీడాకారులే అర్హులని తెలిపారు. శుక్రవారంలోపు ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పురుషులకుకబడ్డీ, వాలీబాల్, మహిళలకు త్రోబాల్, టెన్నికాయిట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడాంశాలను ఎంపిక చేశామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 93470 38584, 99660 81144, 90596 06346 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఎస్ ఏపీసీగా వెంకటరమణ



చిత్తూరు సెంట్రల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా ఎం.వెంకటరమణను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుపతి జిల్లా సహకార అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఈయన్ను డిప్యుటేషన్‌పై ప్రభుత్వం ఏపీసీగా నియమించింది. గతంలో ఈయన జిల్లా విద్యాశాఖలో మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లో స్కూల్ అసిస్టెంట్, పుంగనూరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేశారు. ఆపై గ్రూప్2 ద్వారా కోఆపరేటివ్ శాఖలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఏపీసీగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి వైసీపీ ప్రభుత్వంలో సహకార శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఈయనకు ఇక్కడ ఐదేళ్ల పదవీ కాలం పూర్తైంది. అంతకు ముందే తనను మాతృశాఖకు పంపాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేయగా, ప్రత్యామ్నాయం లేకపోవడంతో కొనసాగించాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీసీ స్థానానికి పలువురు దరఖాస్తు చేస్తున్నారు. అవి ప్రభుత్వ పరిశీలనలో ఉండటం, జడ్పీ, జిల్లా స్థాయి సమావేశాల్లో ప్రజాప్రతినిధుల నుంచి విమర్శలకు గురికావడంతో, అప్పటికే ఏపీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న మద్దిపట్ల వెంకటరమణను ప్రభుత్వం నియమించింది. ఒకటి రెండు రోజుల్లో ఈయన ఏపీసీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

షటిల్ టోర్నీ విజేత సోమల



నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల హైస్కూల్ ఆవరణంలో రెండు రోజులుగా హోరాహోరీగా సాగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో 32 టీముల మధ్య పోటీలు జరిగాయి. బుధవారం సోమల జట్టు విజేతగాను, కరకమంద జట్టు రన్నర్స్‌గా నిలిచినట్లు నిర్వాహకులు నవీన్‌రాయల్, అనిల్, లోకేశ్ తెలిపారు. విజేత జట్టులో దామోదరం, ప్రేమ్, రన్నర్స్ జట్టు ఉదయ్, ప్రవీణ్‌లకు రూ.9 వేలు, రూ.6వేలు వంతున నగదు బహుమతులు, జ్ఞాపికలను జి.మోహన్ కుమార్ జ్ఞాపకార్థం మిత్రులు అందించారు. కార్యక్రమంలో పీడీ కరుణానిధి, ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ కర్రి జ్యోతీశ్వరుడు, శెట్టివారి మోహన్, వినయ్ కుమార్, అభిషేక్, చందూ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణ మండపానికి విరాళం


మండపానికి విరాళం అందజేస్తున్న దాత ప్రభాకర్

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల స్వయంభేశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మాణంలోని శివపార్వతుల కల్యాణ మండపానికి విశ్రాంత మదనపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రభాకర్ సతీమణి గన్నా వసంత కుమారి జ్ఞాపకార్థం రూ..50,116 విరాళంగా ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆలయంలో పూజలు చేపట్టి దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బీవీ సోమశేఖర్, బీవీ సుబ్రహ్మణ్యంబాబు, నరేంద్రబాబు, నాగరాజ, శంకర్‌రెడ్డి, టీవీ. రమణ, వి.వి.రమణ, సీతారామయ్య, ఆలయ అర్చకులు విద్యాసాగర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతగా సోమల జట్టు



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నాలుగు రోజులపాటు శివాలయం రాయల్స్ సీజన్-9 ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. 34 టీములు పాల్గొనగా చివరి ఫైనల్‌లో 57 పరుగుల ఆధిక్యతతో సోమల-ఎ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా నెల్లిమంద టీమ్, సోమల-సి టీమ్ తృతీయ స్థానంలో నిలిచింది. ఈక్రమంలోనే విజేతలకు సుమన్ టీవీ ప్రతినిధి కోలా సోమశేఖర్ విజేత టీమ్‌కు రూ.30 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు, తృతీయ జట్టుకు రూ.10 వేలు అందజేశారు. కోలా సోమశేఖర్‌ను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు వినయ్ కుమార్, సునిల్, అభిషేక్, నవీన్ రాయల్, డి. వేణుగోపాల్, ఎఎస్‌ఐ దామోదరం, వీవీ. రమణ, తమ్మిశెట్టి సోమశేఖర్, నగేశ్, మదన్‌మోహన్‌బాబు, శివశంకర్, మహేంద్రబాబు, చాణుక్య, శంకర్‌రెడ్డి, మునివెంకటప్ప, జగన్, బీవీఎస్.బాబు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణారెడ్డికి ఘన నివాళులు


జయంతి వేడుకల్లో అభిమాన సంఘ నాయకులు

పుంగనూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి జయంతి వేడుకలను పుంగనూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్, చిత్తూరు మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి విగ్రహాలకు రామకృష్ణారెడ్డి అభిమాన సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రత్నమ్మ, అభిమాన సంఘ నాయకులు మధుసూదన్ రాయల్, అనిల్, మదుల్లా, సయ్యద్‌బాషా, అఫ్రోజ్, నూర్, అజీజ్, రాంపల్లెబాబు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి నివాళి


సీతాపతిరాజు

పుంగనూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు.. ఉద్యమనేత సీతారామరాజు బుధవారం మృతి చెందాడు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగులు, విశ్రాంత ఉపాధ్యాయులు చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, చెంగారెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాగానిపల్లె సమస్యలు పరిష్కరించాలి


చల్లా రామచంద్రారెడ్డిని కలిసిన రాగానిపల్లె టీడీపీ నాయకులు

పుంగనూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగానిపల్లె గ్రామ పంచాయతీలోని సమస్యలను టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు రాజంపేట పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. మంగళవారం రొంపిచెర్లలోని ఆయన స్వగృహంలో ఆయన్ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పుంగనూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె- పలమనేరు బైపాస్‌రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తాపడటంతో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం తెల్లవారుజామున జరిగింది. వివరాలిలా... అనంతపురం జిల్లా వడ్డిమర్రికి చెందిన పెద్దన్న కుమారుడు శ్రీరాములు(62), తన భార్య లక్ష్మీదేవి(56), కుమారుడు తిరుమలకొండ (45)లు బైరెడ్డిపల్లె మండలం విరూపాక్షిపురంలో పక్షవాతం మందు తీసుకోవడానికి కారులో వెళుతుండగా పుంగనూరు సమీపంలోని బైపాస్‌రోడ్డులో కారు అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

కల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కావేటిగారిపల్లి పంచాయతీ చెన్నుపాటివారిపల్లిలో అనారోగ్యానికి గురైన టీడీపీ నాయకుడు పురుషోత్తం నాయుడును బుధవారం చల్లా రామచంద్రారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామనాథంనాయుడు, కుమార్‌రెడ్డి, గోపినాయుడు, మునికృష్ణమనాయుడు, ధనంజయనాయుడు, శంకర్, కిషోర్, తేజ, దేవ, జయచంద్ర, పరంధామనాయుడు, రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయం అందజేస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మండలంలోని ప్రసన్నయ్యగారిపల్లెలో జరిగిన భూ ఘర్షణలో కత్తిపోట్లకు గురైన సుబ్రహ్మణ్యం కుటుంబానికి జనసేన నాయకులు బుధవారం రూ.60 వేలు ఆర్థిక సహాయం అందించారు. ప్రభుత్వ భూమిని అక్రమించుకోవడమే కాకుండా గ్రామస్తులపై వైసీపీ నాయకులు శ్రీనివాసులు కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్యంపై దాడికి పాల్పడటం సరికాదన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు ఆగడాలకు స్వస్తి పలకాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిన్నారాయల్, చైతన్యరాయల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పట్టువస్త్రాల పంపిణీ


పెళ్లికి ఆహ్వానం పలుకుతున్న బీఎంకే దంపతులు

కుప్పం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గంగమ్మ గుడి మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు బీఎంకే రవిచంద్రబాబు దంపతులు ఈనెలలో జరుగబోయే తమ కుమార్తె వివాహాన్ని పురస్కరించుకుని పేదింటి మహిళలకు పట్టు చీరలు పంపిణీ చేశారు. వారు నివాసం ఉంటున్న కుప్పం మున్సిపాలిటీ బైరుగానిపల్లెలో బుధవారం ప్రతి ఇంటికీ వెళ్లి ఆహ్వాన పత్రిక అందించడంతోపాటు పట్టు చీరలు సారెగా ఇచ్చి కుమార్తె వివాహానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు


మహిళలకు బహుమతులు అందజేసిన సీపీఎం నాయకులు

పలమనేరు, జనవరి15 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా పలమనేరులో సీపీఎం నాయకులు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో విజేతలైన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, పలమనేరు సీపీఎం నాయకుడు గిరిధరగుప్తా, రాజా, జయంతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

పలమనేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం పలమనేరు టీడీపీ అధ్యక్షులు ఆర్బీసీ కుట్టి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పలమనేరు బాయ్స్ ఆఫ్ బాలు క్రికెట్ అకాడమీ వారిచే స్థానిక షిఫా వుయ్ కేర్ ఐవీఎఫ్ సెంటర్ సహకారంతో ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కోచ్ బాలాజి తెలిపారు. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విజేతలకు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని కోచ్, టోర్నమెంట్ నిర్వాహకులు బాలాజి తెలిపారు.

పేదల పక్షపాతి.. దొరస్వామినాయుడు


కార్యక్రమంలో మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

కుప్పం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే దొరస్వామినాయుడు పేదల పక్షపాతి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సంక్రాంతి పర్వం రోజున దొరస్వామినాయుడు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం మాట్లాడుతూ కుప్పం ప్రజలకు ఎమ్మెల్యేగా దొరస్వామినాయుడు ఎంతో సేవ చేశారని కొనియాడారు. దొరస్వామినాయుడు కుమారుడు, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు మాట్లాడుతూ తన తండ్రి అజాత శత్రువని, ఎమ్మెల్యేగా కుప్పం అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. పార్టీలకతీతంగా పలువురు కార్యక్రమంలో పాల్గొని దొరస్వామినాయుడుకు నివాళులర్పించారు.

నందీశ్వరుడికి రంగులు


సోమలలో నందీశ్వరుడికి రంగులు దిద్దుతున్న గ్రామస్తులు

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం నంజంపేట రోడ్డులో తూర్పు మొగసాల వద్ద గంగమ్మ ఆలయంపై నందీశ్వరుడిని పురాతన కాలంలో ప్రతిష్ఠించారు. సంక్రాంతి సందర్భంగా పోలూరు కుటుంబ సభ్యులు నందీశ్వరుడికి రంగులు దిద్దారు. కొన్నేళ్ల క్రితం గ్రామంలో కలరా వచ్చి ప్రజలు మరణిస్తూ ఉండటంతో అప్పట్లో పశుసంపద పైనే ఆధారపడి ఉండేవారు. పశువులకు వ్యాధులు సోకి మృత్యువాత పడటంతో అప్పట్లో రైతులందరూ శివాలయం వద్ద చేరి తూర్పు మొగసాల వద్ద నందీశ్వరుడిని, గంగమ్మను ప్రతిష్ఠించి పూజలు చేపట్టారు. ఈ క్రమంలో పశువులకు వ్యాధులు క్షీణించాయి. అమ్మవారే తమ పశుసందపకు అండగా ఉందని భావించి ఏటా కనుమ పండుగ రోజున పూజలు జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. నేటికీ నందీశ్వరుడికి రంగులు దిద్దడం..ప్రత్యేక పూజలు కొనసాగడంతో నంజంపేట రోడ్డులో ప్రయాణించే వారు ఆసక్తిగా తిలకించారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

పుంగనూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతూ పట్టుబడిన ఎనిమిది మందిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని బోడేవారిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నామని... వారి నుంచి రూ. 61,250 నగదు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

వరసిద్ధుడి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి


న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల(కాణిపాకం), జనవరి 15 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకరిగౌడ కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని మంగళవారం దర్శించుకున్నారు. అయన్ను సూపరింటెడెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి, కాణిపాకం ఎస్ఐ ధరణిధర తదితరులు పాల్గొన్నారు.

ఆగిన అభివృద్ధి పనులకు మహర్దశ

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ఆగిన అభివృద్ధి పనులన్నీ జరుగుతున్నాయని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం కనుమ సందర్భంగా తన స్వగ్రామం మండలంలోని కెళవాతిలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చెప్పిన పనులన్నీ ఇప్పుడు చేసి చూపెడుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరునెలల్లో రూ.13 కోట్లతో సిమెంట్ రోడ్లు, రూ.10 కోట్లతో లింక్ రోడ్లు, ఈఏపీతో రూ.132 కోట్లతో 117 పనులు, రూ 29.09 కోట్లతో కౌండిన్య పరివాహక ప్రాంతంలో చెక్‌డ్యాముల నిర్మాణం, రూ 6.92 కోట్లతో ఎస్సీ కమ్యూనిటీ హాల్స్, రూ 1.90 కోట్లతో బాబుజగజ్జీవన్‌రాం భవనం, పలమనేరు దాహార్తి తీర్చడానికి గంగన్న శిరస్సు స్టేజ్-1 క్లియరెన్స్ కోసం రూ.9.32 కోట్లు, స్టేజ్-2 క్లియరెన్స్ రోసం రూ.27 కోట్లు, విద్యుత్ లోవోల్టేజ్ సమస్య పరిష్కారం కోసం రూ.45 కోట్లతో సబ్ స్టేషన్‌ల ఏర్పాటు, పాలిటెక్నిక్ రూ.11 కోట్లు, 33 ఎకరాలలో మోడల్ అగ్రికల్చర్ మార్కెట్ ఏర్పాటు, రూ.22 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటు, బీసీ బాలికల రెసిడెన్సియల్ భవనం కోసం రూ.17 కోట్లు, మైనారిటీ బాలికల రెసిడెన్సియల్ కోసం రూ.15 కోట్లు, రూ.22.65 కోట్లతో కైగల్ ప్రాజెక్ట్, రూ.9 కోట్లతో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుతో పాటు వి.కోటలో డిగ్రి కాలేజ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే పలమనేరు పట్టణంలో పూర్తి స్థాయిలో రోడ్ల అభివృద్ధికి రూ.110 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అంచలంచలుగా పలమనేరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. స్వగ్రామంలో జరిగిన కనుమ పూజలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు శ్రీనాథరెడ్డి, కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వి.కోటకు తూర్పు వైపునే బైపాస్ నిర్మాణం

●వి.కోట: వి.కోట మండల ప్రజలు ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు పట్టణానికి తూర్పు వైపునే నిర్మిస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం కనుమ పండుగ సందర్భంగా వారి స్వగ్రామైన కెళవాతిలో కూటమి ప్రభుత్వ పాలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధిని వివరించారు. వి.కోట ప్రజల కోరిక మేరకు పలమనేరు నుంచి కుప్పం మీదుగా కృష్ణగిరి సరిహద్దుల వరకు నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వి.కోటకు తూర్పు వైపున రెండు హైవేలు కలుపుతూ రోడ్డు అందుబాటులోకి రావడంతో కుప్పం ఎయిర్ పోర్టుకు కార్గోను సులువుగా తరలించవచ్చన్నారు. తూర్పు వైపు బైపాస్ అందుబాటులోకి వచ్చాక.. కర్ణాటక మీదుగా ఉన్న రోడ్డు అందుబాటులోకి వస్తే వి.కోటకు అన్ని వైపులా రింగ్ రోడ్డు ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. బైరెడ్డిపల్లె, వి.కోట బైపాస్‌లతో పాటు కుప్పం మీదుగా నాలుగు లైన్ల రోడ్డు వెడల్పు పనులకు డీపీఆర్ పూర్తయి టెండర్ల దశలో ఉందన్నారు. అలాగే బైరెడ్డిపల్లె వద్ద ఎక్స్‌ప్రెస్ వేను సద్వినియోగం చేసుకుని సమీపంలోని కైగల్ జలపాతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. నియోజక వర్గంలో ఏనుగుల కట్టడికి తీసుకుంటున్న ప్రాజెక్టుపై ఆయన వివరించారు.

నేత్రపర్వం.. మకరజ్యోతి దర్శనం



ఆభరణాలను తీసుకెళ్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , అలంకరణలో అయ్యప్పస్వామి

సదుం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సదుం మండలం ఎర్రాతివారిపల్లెలోని బురుజుకొండపై కొలువైన అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం భక్తులకు మకర జ్యోతి దర్శనం కల్పించారు. జ్యోతి దర్శనం కోసం జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో ఎర్రాతివారిపల్లె జన సంద్రంగా మారింది. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మకరజ్యోతి దర్శనం వైభవంగా నిర్వహించారు. సదుం ఎల్లమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కేరళ శబరిమలై ఆలయ సంప్రదాయ వాయిద్యాలు, భక్తుల నడుమ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తిరువాభరణాలను ఆలయ సన్నిధానానికి తీసుకెళ్లి స్వామి వారికి సమర్పించారు. మండలం రోజులు అయ్యప్ప దీక్షలో ఉన్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి , జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, పలువురు ప్రముఖులు స్వామి వారికి ఇరుముడులు చెల్లించుకున్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో పాటు పుంగనూరు, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లోని పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు.

●కల్లూరు: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం పులిచెర్ల మండలం పాళెం కొండపై వెలసిన అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మాజీ సభ్యులు అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షులు నాధమునిరెడ్డి, నాయకులు రెడ్డిప్రకాష్, నరసింహులుశెట్టి, గోవిందరెడ్డి, దామోదర్, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మయ్య, కోదండయ్య, నరసింహులు, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

చౌడేపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు బుధవారం ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 13న పుంగనూరుకు చెందిన ఈశ్వరయ్య కుమారుడు బాలాజీ (39) ద్విచక్రవాహనంలో బోయకొండ గంగమ్మను దర్శించుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. కొలింపల్లె సమీపంలో ఓ ప్రైవేటు బస్సు వెనుక వైపు నుంచి ఢీకొంది. ప్రమాదంలో బాలాజీ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

కాటిపేరిలో వీధి దీపాల ఏర్పాటు



చౌడేపల్లె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో కాటిపేరిలో బుధవారం 35 ఎల్ఈడీ వీధి దీపాలుఏర్పాటు చేశారు. నాయకులు కుమార్‌రెడ్డి, గంగధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన షౌకత్‌బాషా

కల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరు పోలీసు సర్కిల్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. కల్లూరు పట్టణం పీలేరు రోడ్డులో కాపురం ఉంటున్న షేక్ షౌకత్ బాషా (60) బుధవారం రాత్రి బస్టాండు వైపు నుంచి పీలేరు రోడ్డులోని తన ఇంటికి వెళుతున్నాడు. పీలేరు నుంచి చిత్తూరుకు ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సు షౌకత్‌బాషాను ఢీకొంది. ప్రమాదంలో అతని తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషయంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బావపై బావమరిది దాడి

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సోమల పంచాయతీ దిడ్డివారిపల్లె బీసీ కాలనీలో బావపై బావమరిది కత్తితో దాడి చేసిన సంఘటన బుధవారం జరిగింది. ఇంటి వద్ద బావ భీముడు, బావమరిది సుబ్రహ్మణ్యం మధ్య చిన్నపాటి వివాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో సుబ్రహ్మణ్యం కత్తితో భీముడుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో గాయపడిన భీముడుని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సోమల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పలమనేరు డీఎస్పీ కార్యాలయానికి మిథున్‌రెడ్డి

పలమనేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో ఎన్నికల అనంతరం జరిగిన సంఘటనల్లో పోలీసులు నమోదు చేసిన కేసుల్లో కండీషన్ బెయిల్ పొందిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి బుధవారం పలమనేరుకు వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు మిథున్‌రెడ్డి పలమనేరు డీఎస్‌పీ కార్యాలయానికి వెళ్లి అక్కడ కండీషన్ బెయిల్‌కు సంబంధించి సంతకాలు చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైసీపీ నాయకులు రెడ్డెప్ప, చెంగారెడ్డి, శశిధర్‌నాయుడు, జాఫర్, ముజ్జు, పలువురు వైసీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా గురజాల జన్మదినం



చిత్తూరు సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ 42వ జన్మదిన వేడుకలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. బీవీ రెడ్డి కాలనీ నుంచి న్యూట్రిన్ ఫ్యాక్టరీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీ ఆవరణలో వైద్యశిబిరాలు నిర్వహించారు. రోగులకు ఉచిత వైద్యపరీక్షలతో పాటు మందులను పంపిణీ చేశారు. ఎన్టీయార్ ట్రస్ట్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని ఎన్టీయార్ ట్రస్టుకు, అపోలో ఆస్పత్రికి ఇచ్చారు. పేదలకు 42 ఆటోలు, 42 ద్విచక్ర వాహనాలు, 42 సైకిళ్లు, 42 పానీ పూరి బండ్లు, 42 తోపుడు బండ్లు, 42 టీ స్టాళ్ల పంపిణీ చేశారు. జబర్దస్త్ ఫేం రాకెట్ రాఘవ టీం ఆధ్వర్యంలో కామెడీ షో నిర్వహించారు. ఆట సందీప్ మాస్టర్ చేసిన డ్యాన్స్‌లు అలరించాయి.

ఊరూరా సంక్రాంతి సంబరాలు

సోమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెల్లో బుధవారం పశువుల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పశువులకు స్నానాలు చేయించి ప్రత్యేక అలంకరణలు చేశారు. కొమ్ములకు రంగులు వేసి పుష్పాలతో అలంకరించారు. కొత్తూరు, నంజంపేట, కమ్మపల్లె, గట్టువారిపల్లె, ఎర్రనాగులపల్లెలో పశువులకు పరుగు పందెం నిర్వహించారు. యువకులు పశువులను నిలువరించడానికి పోటీలు పడ్డారు. సాయంత్రం పశువులను ఊరేగింపుగా కాటమరాజు ఆలయం వద్దకు తీసుకెళ్లి చిట్లాకుప్పల చుట్టూ ప్రదక్షణలు చేయించారు. శివాలయం రాయల్స్ యువత సోమల హైస్కూల్‌లో కోడిగిత్తలను పరుగులు పెట్టించారు. విజేత హర్ష కోడి గిత్తకు రూ.10 వేలు నగదు బహుమతి అందజేశారు.

●బైరెడ్డిపల్లె, వి.కోట: బైరెడ్డిపల్లె మండల పరిధిలో కనుమ పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం పాతూరునత్తం గ్రామంలో కనుమ పండుగను పురస్కరించుకుని గ్రామదేవత విగ్రహాన్ని పల్లెలోని వాడవాడలా ఊరేగించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గ్రామంలోని పశువులకు యువకులు ప్రభలను కట్టి పల్లెలో పరుగులు పెట్టించారు.

●కల్లూరు: పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో బుధవారం ఆయన పశువుల పండుగను ప్రారంభించారు. ప్రత్యేక అలంకరణగా నిలిచిన పశువులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిగా గ్రాము బంగారం, రెండో బహుమతిగా 60 గ్రాముల వెండి, మూడో బహుమతిగా సెల్‌ఫోన్‌ను అందజేశారు.

●వి.కోట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వి.కోట మండల పరిధిలో సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. బుధవారం చింతమాకులపల్లెలో గ్రామం నడిబొడ్డున ఉన్న గంగమ్మ ఆలయం వద్ద పశువులకు పూజలు నిర్వహించి పరుగులు పెట్టించారు. అలాగే గోనుమాకులపల్లె, పాపేపల్లె, శివుని కుప్పం, ఎల్లాగరం, దొమ్మరిమిట్ట, ఎడుచుట్లకోట, ముదరందొడ్డి, ఎస్.బండపల్లె, కె.గొల్లపల్లె గ్రామాల్లో కనుమ పండుగను ఘనంగా జరుపుకున్నారు.

●రామకుప్పం: రామకుప్పం మండలంలో ప్రజలు సంక్రాంతి, కనుమ సంబరాలను కోలాహలంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేక పూజలు జరిగాయి. అమ్మవార్లకు పొంగళ్లు పెట్టారు.

●పుంగనూరు రూరల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో సంక్రాంతి పండుగ వైభవంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని చదళ్ల, నల్లగుంట్లపల్లె, ఏతూరు, మర్రిమాకులపల్లె, చెర్లోపల్లె, బర్నేపల్లె తదితర గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. ఉదయాన్నే ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. పశువులకు నడివీధి గంగమ్మ వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు.

●రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలో బుధవారం కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు.


పశువులకు చల్లా రామచంద్రారెడ్డి పూజలు


పాతూరునత్తం గ్రామంలో ఊరేగింపుగా వెళుతున్న అమ్మవారు


కెంపసముద్రంలో పొంగళ్లు


సోమలలో చిట్లాకుప్ప చుట్టూ పశువులు

కల్యాణం.. కమనీయం...!


మాంగళ్యాన్ని భక్తులకు చూపిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయంలో మంగళవారం సంక్రాంతి సందర్భంగా సీతారాముల కల్యాణం అత్యంత కమనీయంగా జరిగింది. ఈకార్యక్రమానికి పీలేరు వ్యాస్తవ్యులు సీతారామిరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఉభయదారంగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు వేణుగోపాల్ బృందం స్వామి అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని శ్రీరంగపట్నం శ్రీవైష్ణవ సంప్రదాయంలో జరిపించారు. భక్తులకు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, అక్షింతలు, తలంబ్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చెంగల్‌రాయలు, రెడ్డెప్ప, రవి, శీను, భక్తులు పాల్గొన్నారు.


నారావారిపల్లెలో సీఎం చంద్రబాబును కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన ప్రభుత్వ విప్ థామస్


నారావారిపల్లెలో బుధవారం మంత్రి లోకేశ్‌కు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



ఆర్థికసాయం

బంగారుపాళ్యం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నలగాంపల్లె గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దినకర్ కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బాలరాజు నాయుడి కుమారుడు ఎన్ఆర్ఐ ఎస్‌పి విక్రమ్ దంపతులు రూ.50 వేల ఆర్థిక సాయం అందించారు.

రంకెలేసిన కోడె గిత్తలు

- తుమ్మిందలో జల్లికట్టు


తుమ్మిందలో - తూంపాయనపల్లెలో జల్లికట్టు సందడి

చిత్తూరు రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని తుమ్మిందలో బుధవారం కనుమ పండుగను పురస్కరించుకొని కోడెగిత్తలు రంకెలేశాయి. జల్లికట్టు, కోడి పందేలు నిర్వహించకూడదని పోలీసులు ఆంక్షలు విధించారు. రాజకీయ నాయకుల జోక్యంతో గ్రామస్తులు జల్లికట్టు నిర్వహించారు. ఎద్దుల కొమ్ములకు కట్టిన నగదు బహుమతి కోసం యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కాగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గిర్వాణీ చంద్రప్రకాష్ సొంత గ్రామమైన బీఎన్ఆర్ పేటలో క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. విజేతలకు చంద్రప్రకాష్ రూ.10 వేలు చొప్పున బహుమతులు ప్రదానం చేశారు.

పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపనపల్లిలో నిర్వహించిన జల్లికట్టులో గ్రామస్థులు తమ కోడెగిత్తలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలతో అలంకరించి వీధుల్లో పరుగెత్తించారు. వాటిని పట్టుకునేందుకు యువకులు ఉత్సాహం చూపారు.

బంగారుపాళ్యం (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూంపాయనపల్లెలో జల్లికట్టు పోటీలు నిర్వహించగా, కోడె గిత్తలను యజమానులు అలంకరించి గిత్తలను తరిమారు. గిత్తలకు కట్టిన పట్టీలను చేజిక్కించుకోవడానికి యువకులు ఉత్సాహం చూపారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు, యువకులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ యువ నాయకుడి మృతి

వెదురుకుప్పం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం పంచాయతీ మూలకండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ యువ నాయకుడు మంచాల దేవేంద్ర(28) మంగళవారం గుండె పోటుకు గురై మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ పోటీల్లో పాల్గొని గుండె నొప్పి రావడంతో చతికిలపడి చనిపోయాడని చెప్పారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు బుధవారం ఆ గ్రామానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కార్వేటినగరం మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి, నేతలు సోమశేఖర్ యాదవ్, రాధాకృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీని చింపిన అదే పార్టీ కార్యకర్తలు

పూతలపట్టు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని టీడీపీ కార్యకర్తలు చించివేశారు. దీనిపై ఆ పార్టీకే చెందిన ఇరువర్గాల కార్యకర్తలు ఒక వర్గంపై మరో వర్గం దాడులు చేసుకుని, పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు. మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలువురు నాయకులకు శుభాకాంక్షలు తెలుపుతూ తమ గ్రామ సమీపాన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి నలుగురు టీడీపీ కార్యకర్తలు రంగంపేట వద్దకు చేరుకుని ఫ్లెక్సీని చింపారు. దీనిని గమనించిన అదే గ్రామానికి చెందిన ఓ టీడీపీ కార్యకర్త నిలదీయడంతో ఇరువర్గాలవారు ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. ఈ సంఘటనలో ఇరువర్గాల వారు స్వల్పంగా గాయపడ్డారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు పోలీసులకు ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు.

వైభవంగా సంక్రాంతి సంబరాలు

విజయపురం, జనవరి 15: సంక్రాంతిని పురస్కరించుకొని జగన్నాథపురంలో శ్రీరామ నామక్షేత్రంలో, పన్నూరులో ఆనందవల్లి ఇష్టకామేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విజయపురం, కోసలనగరం, జంబాడలో పిల్లలకు మ్యూజికల్ డ్యాన్స్ పాటల పోటీలు నిర్వహించారు. పాతార్కాడులో పిల్లలకు ఆటలు, పాటలు, మ్యూజికల్ చైర్, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. నారపరాజు కండ్రిగలో నగరి మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ శోభారామకృష్ణమరాజు క్రికెట్ టోర్నమెంటు నిర్వహించి, విజేతైన మల్లారెడ్డి కండ్రిగ జట్టుకు రూ.5 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.3 వేలు నగదు అందచేశారు.

పాలసముద్రం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీబొమ్మరాజుపురంలోని బాలగురునాథీశ్వర ఆలయంలో గ్రామస్థులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి మూల విరాట్‌కు ప్రత్యేక హోమం నిర్వహించి, పూజలు చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. బుధవాం కనుమ పండగను పురస్కరించుకుని రైతులు పశువులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు వేసి అలంకరించారు.

వెదురుకుప్పం(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం పశువుల పండుగను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గో పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ అధికారి సురేష్‌కుమార్ పర్యవేక్షించారు.

గుడిపాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని 197 రామాపురం, ముట్టుకూరుపల్లి, నంగమంగళం తదితర గ్రామాల్లో కనుమ పండుగను నిర్వహించారు. ముట్టుకూరుపల్లిలో సత్తెమ్మకు భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పాడిఆవులకు పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.

సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోల పంపిణీ

- అట్టహాసంగా ఎమ్మెల్యే గురజాల జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరం పాల్గొని, అనంతరం వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ 42వ జన్మదిన వేడుకలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. బీవీ రెడ్డి కాలనీ నుంచి న్యూట్రిన్ ఫ్యాక్టరీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఫ్యాక్టరీ ఆవరణలో వైద్యశిబిరాలు నిర్వహించారు. రోగులకు ఉచిత వైద్యపరీక్షలతో పాటు మందులను పంపిణీ చేశారు. ఎన్టీయార్ ట్రస్ట్, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సేకరించిన రక్తాన్ని ఎన్టీయార్ ట్రస్ట్‌కు, అపోలో ఆస్పత్రికి ఇచ్చారు. పేదలకు 42 ఆటోలు, 42 ద్విచక్ర వాహనాలు, 42 సైకిళ్లు, 42 పానీపూరి బండ్లు, 42 తోపుడు బండ్లు, 42 టీ స్టాళ్లు పంపిణీ చేశారు. జబర్దస్త్ ఫేం రాకెట్ రాఘవ టీం ఆధ్వర్యంలో కామెడీ షో నిర్వహించారు. ఆట సందీప్ మాస్టర్ చేసిన డ్యాన్స్‌లు అలరించాయి. ఎమ్మెల్యేలు మురళీమోహన్, యార్లగడ్డ వెంకట్రావ్, కాకర్ల సురేష్, దామచర్ల జనార్దన్, సినీ నటుడు సప్తగిరి ప్రసాద్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్ పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్, చిత్తూరు పార్లమెంటు ఎన్నికల కో ఆర్డినేటర్ ఎస్.చంద్రప్రకాష్, గుడిపాల బాలాజీ, దుర్గారామకృష్ణ, వైవీ రాజేశ్వరి, సీఎం విజయ, పులివర్తి వినీల్, వసంత్‌కుమార్, సునీల్, కాజూరు బాలాజీ, వరుణ్ కుమార్, మోహన్‌రాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ సర్కిల్ నుంచి న్యూట్రిన్ ఫ్యాక్టరీ వరకు ర్యాలీగా వెళుతున్న ఎమ్మెల్యే గురజాల

టీడీపీ నేతకు నివాళులు

గంగాధరనెల్లూరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు దళితవాడకు చెందిన టీడీపీ నేత, మాజీ జడ్పీటీసీ ఎం.వెంకటేష్ (59) మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే థామస్, టీడీపీ నేతలు భీమనేని చిట్టిబాబు నాయుడు, ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, వసంతకుమార్, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, ధనంజయనాయుడు, రాంబాబురెడ్డి, దేవసుందరం, లోకేష్‌నాయుడు, జనసేన, బీజేపీ, వైసీపీ నేతలు వెంకటేష్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఎమ్మెల్యేను కల్సిన గుడిపాల నాయకులు

గుడిపాల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జన్మదినం సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, హేమాద్రి నాయుడు ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

పెనుమూరు, (ఆంధ్రజ్యోతి): పెనుమూరు సమీపంలోని బీసీకాలనీ వద్ద ఈ నెల 8వ తేదీన స్కూల్ వ్యాన్ ఢీకొని చార్వాగానిపల్లి గ్రామానికి చెందిన మహేష్, అరుణ దంపతుల పెద్ద కుమారుడు విష్ణు గాయపడ్డాడు. తిరుపతి స్విమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

